# ప్రత్యక్షంలో పరోక్షం

రచన: శ్రీ వి. చక్రపాణి.

నేను విశాఖపట్నము వచ్చి చాలా రోజులయింది. అయినా నాకు పట్టణమంతా తెలీదు. ఏదో ఈ వేళ సెలవు రోజుగదాయని టౌన్ చూడటానికి బయల్దేరాను. జడ్జి కోర్టుమీదగా యూనివర్శిటీ మీదుగా వాల్టేర్ అప్‌లాండ్స్ వెళ్ళాను. సంధ్యా సమయం అగుటచే బజారు కళ కళ లాడుతుంది. అటుఇటుచూస్తూ నా సైకిలు మీద మెల్లగా ముందుకు వెళ్తున్నాను.

ఇంతలో ఒక్కసారి 'కెవ్వు' మని కేక వినపడింది. దృష్టిని ముందుకు సారించాను... అయ్యో... ఇంకేముంది ఎంత ప్రమాదం... ఎవరో పిల్లవాడు నా సైకిల్ క్రిందే పడ్డాడు. అప్రయత్నంగా నా చేతులు సైకిలు బ్రేకులు వేసినవి. నేను క్రిందికిదిగాను. పాపం... ఎవరిపిల్లవాడో ఎంత అదంగా యున్నాడు. ఇంకా నయం దెబ్బ లేమీ తగుల లేదు.

ఆ పిల్లవాడిని నా చేతుల్లోకితీసుకొని ఎత్తుకున్నాను. కాని ఏడ్పు మానటం లేదు. వాడిని ఏడుపు మాన్పింపటానికి నేను శతవిధాల ప్రయత్నం చేస్తున్నాను. కానీ ఫలితం శూన్యం.

ఇంతలో నాకు దగ్గరలోనున్న ఇంటిగేటు తీసుకొని ఒక స్త్రీ నావైపు వస్తుంది. పిల్లవాడి తల్లి కాబోలు అనుకున్నాను. ఒకసారి ఆమెను చూచాను... అరె... ఆశ్చర్యం... ఆమె అక్కడేనిలబడిపోయిందే... కదలదేం ఒకవేళ పిల్లవాడితల్లి కాదేమో... అయితే అలా బెంగతో నావంక చూస్తుందే. ఈ సారిమరీపరీక్షగా చూచాను ఆమె... ఆమె... ఎవరు... కళ్ళు నలుపుకొని చూచాను. నా కళ్ళను నేనే నమ్మలేక పోతున్నాను...... నేనెవరి కోసమయితే ఈ నాటివరకు వివాహము చేసుకోలేదో, ఎవరికోస మయితే ఇన్ని రోజులనుండి దేశ దేశాలు గాలిస్తున్నానో ఎవరికోస మయితే నేనీ భూమిమీద బ్రతికియున్నానో... ఆమె... మంజులత ... నా జీవిత సహపాతిగా ఉంటానని బాసచేసిన బాల.

నాకు తెలియకుండా మాయమై ఇన్నాళ్ళకు నాకిక్కడ దర్శన మిచ్చింది. అరె! మంజులత... నా మంజులత... కాదు... కాదు... ఇహ నా మంజులత కాదు... వివాహమైందా... నన్నుతప్ప అన్యులను వివాహ మాడనని పలికింది. ఈ పడతేనా!.

ఈ పిల్లవాడు ఈమె సంతతే కావచ్చు... ఇందులో సందేహమేముంది... అరె! ఆమె అలాగేనిలబడిందే... నన్ను గుర్తు పట్టిందో లేదో. గుర్తు పట్టేవుంటుంది. అందుకే అలా నిలబడి పోయింది. మంజులతను గూర్చి ఆలోచనలు మస్తిష్కంలో మెదల సాగినవి.

* * *

అప్పుడు నేను ఫోర్తు ఇయర్ చదువుతున్న రోజులు. మంజులత ఇంటర్ చదువుతుంది. మంజులతవాళ్ళు మా ఇంటిలోనే అద్దెకుంటున్నారు. మంజులత తండ్రి యస్. ఐ. మంజులతకు శారదా అనే అక్క వుంది. ఆమెకు పెళ్ళయిపోయి కాపురము చేసుకుంటుంది. యస్. ఐ. మగసంతానము లేదు.

ఆరోజు వర్షము ఒకమాదిరిగా కురుస్తున్నది. కాలేజీ టైమ్ అయింది. రిక్షా కొరకు బయట నిలబడ్డాను. మంజులతకుకూడ కాలేజి టైమ్ అయింది గాబోలు ఆమె కూడరిక్షాకొరకే వచ్చింది. దూరంగా ఒకరిక్షా పోతుంది. రిక్షాను పిలిచాను.

"ఏ రిక్షా ఏ. సి. కాలేజికి ఏమితీసికొంటావు"

"అర ణాలండి"

"ఏ రిక్షా నేను అర్ధరూపాయియిస్తాను. లేడీస్ హాస్ కాలేజికి" మంజులత అంది.

నాకు అరకాలిమంట నెత్తి కెక్కింది. నాస్వార్జితం ఆమె అనుభవిద్దామంటే?

'పదణాలిస్తా రావోయ్' అన్నాను నేను. మంజులత నావంక రుస రుస చూచింది. అది బజారై పోయింద లేకపోతే బావురుమని ఏడ్చేదే!

"ముప్పావలా ఇస్తా రావోయ్" అంది మంజులత నావంక గర్వంగా చూస్తూ.

మా తగవుచూస్తూ రిక్షావాడు మెల్లమెల్లగా నవ్వుకుంటున్నాడు.

"నేనొక సంగతి చెప్తాను వింటారా బాబుగారూ"

"ఏమిటి" అన్నాము ఇద్దరం ఒక్కసారి.

"అమ్మాయిగారు! మీరు బాబుగారు ఇద్దరూ కాలేజికి వెళ్ళవలసిన వారె. టైమ్ అయిపోతుంది. అందుకని ఇద్దరూ ఈబండిలో వెళితే ఎవరికీ కాలేజీపోదు" అన్నాడు.

నాకు వాడిమాటలకు ఆశ్చర్యం వేసింది. కాని వాడు చెప్పిందే సబబుగా తోచింది...అయితే నా కభ్యంతరం లేదుకాని,..మంజులతకే...ఆమె వంక సాభిప్రాయంగా చూచాను ... ఆమె సిగ్గుతో తలవంచుకొంది. ప్రస్తుతానికి రిక్షావాడు చెప్పిందిబాగావుంది. అందుకనే ఆమె కూడ కాదనలేక పోయింది. ఇంకేం...ఇద్దరం ఒకేరిక్షాలో కాలేజి ప్రయాణం, అసలే గుంటూరు రిక్షాలు ఇరుకు...మేము సర్దుకు కూర్చునే సరికి తల ప్రాణం తోకకు వచ్చింది.

ఎ. సి. కాలేజి వచ్చింది. రిక్షా దిగాను, రూపాయి వాడికిచ్చాను. వాడు చిల్లర లేదన్నాడు. "పరవాలేదు ... నేనిస్తాలే...పోనియి రిక్షా" అంది మంజులత.

రిక్షాకు డబ్బులుకూడ మంజులత చేతే ఇప్పించాను.

*　　*　　*

ఆవేళ కాలేజీ లేదు. రేడియోలో సిలోన్ నుండి మంచి సాంగ్స్' వస్తున్నాయి శ్రద్ధతో వింటూ కూర్చున్నాను. "ఏమండీ, కాస్త ఆరేడియో ఆపు చెయ్యమని చెప్పండి. మీ ... అబ్బాయిగారికి "అంటూ మంజులత మా అమ్మతో చెప్పటము నాకు విన్పించింది.

"ఏం ! నాతోనే చెప్పగూడదూ" అనుకొన్నాను నేను.

"ఏమోనమ్మా ! నామాట వింటాడావాడు. నువ్వే వెళ్ళి చెప్పమ్మా" మా అమ్మ అంది... నాకు నవ్వాగ లేదు... మంజులతికిక తప్పలేదు...

గదిలోకి వస్తున్నట్లు కాళ్ళ సవ్వడే తుల్పుతుంది.

మంజులత గదిలోకివచ్చి "ఏమండీ..."

"ఏమి టండి..."

"కాస్త రేడియో ..."

"ఓ దానికేమి భాగ్యము... ఆకుర్చీలో కూర్చొని వినండి...నాకేం అభ్యంతరము లేదు"

"అదిగాదండి... కాస్త ఆపు చెయ్యండి"

"ఆ పెయ్యటమా...నోనోనో ! అది నావల్లకాదు.

"మీ వల్లగాకపోతే నేనే ఆపేస్తా నుండండి"అంటూ రేడియో దగ్గిరికి వెళ్ళింది. నేను వద్దంటూ వెళ్ళాను... ఆమె ఆపెయ్య బోయాను. నేను వారించ బొయ్యాను... అంతే...మాచేతులు రెండూ కాసేపు బాండ్స్ దగ్గర యుద్ధము చేసినవి. ఆమె సిగ్గుతో తలవంచుకొని దూరంగా తొలగింది.

"ఏమండి కాస్తరేడియో ఆపండి ... చదువుకోవా లండి"

"చదువుకొండి... నే వద్దన్నానా"

"రేడియో..."

"అదే వద్దన్నాను..."

"మీకు చేతులెత్తి నమస్కరిస్తానండి"

ఇదిగో అమ్మాయి. నీనమస్కారములు స్వీకరించ టానికి నాకు తీరికలేదు అదుగో ! గుళ్ళో దేవుడు ఏపనీ పాట లేక ఊరికే కూర్చున్నాడు. వెళ్ళి వాడికి నమస్కారం చెయ్యి"

"ప్లీజ్... ప్లీజ్..." బ్రతిమాలే ధోరణి

ప్లీజ్...ప్లీజ్...జాన్తానై..."

"మీ మాటలు మీకేనా...ఎదురివారి మాటలు విన గూడదూ?"

"అరెరె ! ఆపేస్తా నుండండి. మీ ముఖము చూస్తే ఇక్కడే భోరుమని ఏడ్చే వాళ్ళులా ఉన్నారే..." అంటూ రేడియో ఆపేశాను.

'చూచారా, నేనేగెల్చాను' అన్నట్లు ఒక్క చూపు... మంజులత నావైపు చూసి లోనికి పరుగెత్తింది.

ఆ విధంగా మా స్నేహము దిన దిన ప్రవర్ధమాన మగు తున్నది.

ఆరోజున నేను మేడపై పచారు చేస్తూ ఉన్నాను...

"ఏమిటో తీవ్రంగా ఆలోచిస్తున్నారు" అంటూ మంజులత వచ్చింది...

"నిజం చెప్పమంటావా...అబద్ధం చెప్పమంటావా" అన్నాను పెద్దపోజులో!

"ఇదొకటా మళ్ళీ... నే చెప్పనని చెప్ప రాదటండీ" అంది కోపంతో.

"అదికాదు మంజూ నేను ఆలోచించేది..."

"ఆ ! మీరు ఆలోచించేది..."

"నిన్ను గురించే..."

"ఆ ! నన్ను గురించా ...నన్ను గురించి ఆలోచించాల్సిందేముంది"

"చాల వుంది మంజూ... మేలిమి బంగారు రంగులో తామర మొగ్గ కలిపిన నీ శరీరచ్ఛాయ, బంగారు గన్నేరు మొగ్గవంటి నీ ముక్కు, కాశీ రత్నపుష్పముల జంట బోలిన యధరము, మిసిమి పసందుల చంపకీ

సువర్ణగాత్రము, రంగులేకయే ప్రవాళముల వలె నెఱ్ఱనై తేనెలూరు చుండు నీ పెదవులు ఎవరికై నిర్దేశించినవో గదా యని ఆలోచిస్తున్నాను ''

'' అబ్బా ! వ్యవహారము చాల వరకు వచ్చిందే. అవి మీ కొరకు అని ఎందుకు అనుకోగూడదు ''

'' మంజూ... '' అంటూ ఆమె చేతిని ఒక్కసారి నా చేతిలోకి తీసుకున్నాను.

'' ఆ ! ఆ ! అక్కడే ఆగండి. శృతి మించి రాగాన పడుతుంది... అంతకన్న ఎక్కువచనువిస్తే ప్రమాదము. ''

'' మంజూ నిన్నే నా జీవిత సహాధ్యాయినిగా చేసుకుంటాను ''

'' మధూ... ఇంతకన్న నాకు కావలసిందేముంది '' అంటూ మంజులత నా చెయ్యి ఒక్కసారిగా తన హృదయానికి హత్తుకుంది.

మా పరీక్షలు అయిపోయినవి. మాలోని భావాలు మా మనసులు దాటి మాతా పితృల వద్దకు చేరలేదు.

అంతలో యస్. ఐ. గారికి అనంతపూరు ట్రాన్స్‌ఫర్ ఆర్డరు వచ్చింది. మా దుఃఖానికి అంతులేదు. ఒకరిని వీడి మరొకరము ఉండలేక పోతున్నాము... కాని తప్పదుగా ... నా నుండి తీరని బాధతో మంజులత వేరయిపోయింది. మనము చేసుకున్న ప్రమాణాలు గుర్తున్నాయని ఎప్పటికైనా మిమ్మలనే వివాహ మాడతానని మంజులత మాటిచ్చి అనంతపూరు వెళ్ళిపోయింది.

మంజులత వారానికోసారి ఉత్తరము వ్రాస్తుండేది. నేను వెంటనే సమాధానము వ్రాస్తూండే వాడిని.

మామూలుగా ఆ వేళ మంజులత దగ్గర నుండి ఉత్తరము వచ్చింది. ఆతృతగా విప్పిచదివాను. నాకు అర్థం కాలేదు. మరొకసారి చదివాను... నాగుండె దడదడ కొట్టుకుంది. మంజులతేనా ఈ ఉత్తరం వ్రాసింది. హాతవిధి కోరికలన్ని కలలేనా... శాశ్వతంగా మంజులతను నేను మర్చిపోవాలా ఏమిటీ అగ్ని పరీక్ష ... ఉత్తరంమళ్ళీ చదివాను.

మధూ !

నీ ఉత్తరము అందినది. నేనీ వుత్తరము ఏంత బాధతో వ్రాస్తున్నానో నాకే తెలియటంలేదు. నేను నీకు ఈవిధంగా వ్రాయవలసి వస్తుందని కలలో గూడ అనుకోలేదు అంతా దైవమాయ. విధివిలాసం. నీవు వ్రాసిన వుత్తరము మా నాన్న చేతిలో పడింది. తోక తొక్కిన త్రాచువలె అయినారు మా నాన్నగారు వన్నెప్పుడైనను ఒక్కమాట గూడా అనలేదు. కాని ఈరోజు అబ్బా ఆబాధ నీకుఏమని వ్రాయను. ఇంక నీతో వుత్తర ప్రతుత్తరాలు జరిపితే ఇంట్లోనుండి వెళ్ళగొడతా మన్నారు... అయితే ఇంకేం... మంచిదేగా అనినీవు అనవచ్చు... కాని పెద్దవాళ్ళనుకాదని మనమేమి చెప్పు. నాకంతా అయోమయంగావుంది మాటలతీరు చూస్తుంటే మా నాన్నకు మన పెళ్ళంటే అసలు యిష్టమున్నట్లే కనబడదు. మధూ! ఇక ఒక్కటే ఉపాయం ఆలోచించాను. ఈ రోజునుండి ఇకనువ్వు నన్ను పూర్తిగా మర్చిపో నా శ్రేయస్సుకోరి ఇక నాకు ఉత్తరాలు వ్రాయవద్దని కోరుతున్నాను.

ఎల్లప్పుడు మిమ్మలను ప్రేమించే...

మంజు.

ఒక్కసారి అచేతనుడ నయ్యాను. అలాగే కుర్చీలో కూల బడ్డాను. మంజులత... మంజు... నా మంజును నేను పూర్తిగా మర్చిపోవాలి... అదెలా సాధ్యం... కాని తప్పదుగా... మంజులత ఎంత బాధ పడుతుందో! హా! దైవమా మమ్మలను పరీక్షిస్తున్నావా 'పిచ్చుక మీద బ్రహ్మాస్త్రమా' నా మంజులతను పూర్తిగా మర్చి పోవలిసిందేనా?

అంతే! ఆరోజునుండి మంజులత నా నుండి మరుగయి పోతున్నది. కాని ఆమెను మర్చిపోవటము నా సాధ్యం కావటము లేదు. తరువాత ఆమె కొఱకు ఎన్నో జాబులు వ్రాసాను. కాని ఫలితము శూన్యము. ఆ నాటి నుండి నేటి వరకు... మంజులతకొఱకు గాలించుతూ నేఉన్నాను. కాని జాడేలేదు.

* * *

నేడు హఠత్తుగా మంజులత నాకు దర్శన మిచ్చింది. ఆమె నన్ను గుర్తు పట్టి ఉండచ్చు... కారణము నాటికీ నేటికీ మార్పే లేదు. సందేహం లేదు... ఆమె నన్ను గుర్తు పట్టింది... అదిగో ఇటే వస్తున్నది...

''మంజులతా...'' అన్నాను నేను ఒక్కసారి.

''మధూ...'' అన్నది మంజులత ఏదో పెద్ద తప్పు చేసినదాని మాదిరిగా.

''మంజూ... నువ్విక్కడ వుంటున్నావా... ఈ పిల్లవాడు మీ అబ్బాయేనా... నీకు పెళ్ళయిందా'' అని

ఒక్కసారి ప్రశ్నలవర్షం కురిపించాను. అన్నిటికీ అవునన్నట్లుగా ఆమె కన్నీరే నాకు సమాధానం ఇచ్చాయి.

"సరే! లోపలికిపోదాం పద మంజులతా అన్నాను.

ఆమె కొంచెం సందేహించినట్లున్నది నన్ను లోపలికి తీసుకువెళ్ళటానికి. చివరికి 'రండి వెళ్దాం' అన్నది.

లోపలకు వెళ్ళాను.

ఇల్లు చాలా పెద్దది. పెద్ద ఆఫీసరు యిల్లులా ఉంది. సోఫాలకు, కుర్చీలకు కొదవేలేదు. నేనొక సోఫామీద కూర్చున్నాను. మంజులత పిల్లవాడిని నా చేతికిచ్చి లోనికి వెళ్ళింది. పిల్లవాడు నా చేతిలో చాలా హుషారుగా ఆడుకొంటున్నాడు.

మంజులత కాఫీ ప్రయిత్నమేమన్నా చేస్తుందేమో ఎంతకూ బయటికిరాలేదు.

ఇంతలో ఒకాయన నేనున్న గదిలోకి వచ్చాడు. తల తిప్పి చూచాను. నా ప్రాణాలు పైనే ఎగిరిపోతున్నట్లనిపించింది.

ఆయన...ఎవరు...ఇంకెవరు... మంజుతండ్రి...

"ఓ మీరా...ఎంతసేపయిందండి వచ్చి."

"ఇప్పుడేనండి...పదినిముషాలన్నా కాలేదు."

"మిమ్ములను కలుసుకొన్నందుకు చాల సంతోషంగా ఉందండి. మీరీ ఊళ్లో ఏమి చేస్తున్నారు" అన్నాడు ఎంతో అప్యాయంగా.

నాకు ఆశ్చర్యమేసింది. ఆయనంత అప్యాయంగా మాట్లాడుతున్నందుకు. నేను మంజులతకు ఉత్తరం రాస్తే మంజు పైచేయి చేసుకుంది ఇక నేనా అనిపించింది.

"కలెక్టర్ ఆఫీసులో పని చేస్తున్నానండి."

"మంచిది నాయనా. 'ఉద్యోగం పురుషలక్షణం' అన్నారుగా పెద్దలు. ఆ! అదిసరేగాని నీకు వివాహమైందా."

నా గుండె దడదడ కొట్టుకుంది.

మంజులత సంగతి ఏమన్నా అడుగుతాడేమో. నేనేమని చెప్పాలి.


అందరూ చదవవలసిన ....

## 'ఆంధ్రప్రదేశ్'

కథలకు, గాధలకు, నాటికలకు. నాటకాలకు, గీతాలకు, కవితలకు, కావ్యాలకు, సాహిత్యవ్యాసాలకు, సాహిత్య విమర్శలకు, వినోదానికి, విజ్ఞానానికి, అభ్యుదయ పథాలు అభివృద్ధి పథకాలను గూర్చిన వార్తలకు, మూర్తులకు, అశేష విశేషాలకు, సచిత్ర మాస పత్రిక :—

## 'ఆంధ్రప్రదేశ్' చదవండి!!

తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉరుదూ, నాలుగు భాషల్లో వెలువడుతున్నది. అతి తక్కువ చందాతో అందరికి అందుబాటులో ఉన్న పత్రిక.

సంవత్సర చందా రు. 3-00 మాత్రమే.

విడి పత్రిక, 25 నయాపైసలు.

'ఆంధ్రప్రదేశ్' పత్రికకు వెంటనే యీక్రింది చిరునామాకు వ్రాయండి:—

సమాచార పౌర సంబంధముల శాఖ,
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం
హైదరాబాదు.

"హాఁ! కృష్ణా! ఆపద్బాంధవా! కరుణాకటాక్షా నీవే దారనుకొని "లేదండి!" అన్నాను.

ఇంతలో ఒక సూట్‌వాలా లోనికివచ్చాడు.

"ఇతనేనండి మా అల్లుడు" అంటూ ఆ నూతనవ్యక్తిని మంజులత తండ్రి నాకు పరిచయం చేశాడు.

ఇద్దరం షేక్‌హాండ్ తీసుకున్నాము.

"పేరు రమాకాంత్. హైవేస్ యింజనీరు" మంజులత తండ్రి చెప్పాడు.

"వీరు..." అంటూ నన్ను చూస్తూ మామగారి నడిగాడు రమాకాంత్.

"వీరిపేరు మధు. మేము గుంటూరులో ఉన్నప్పుడు వీరి యింటిలోనే ఉన్నాము."

"ఓ. ఐసీ. మీ రిప్పుడేమి చేస్తున్నారు."

నేను చెప్పాను.

"ఏమిటి. మీరు విశాఖపట్నములోనే ఉంటూ ఒక్కసారి కూడా రాలేదన్నమాట."

"తీరిక దొరకటంలేదండీ."

"ఏం తీరికండి. ఆఫీసుపనులు ఎప్పుడూ ఉన్నవేగా బైదిబై ఇప్పుడు మీరెక్కడ ఉంటున్నారు."

"మహారాణి పేటలోనండి."

"నాన్‌సెన్స్. మేమిక్కడ వున్నామని తెలిసే మీరక్కడ ఉంటున్నారా. మా యిల్లు చూచారుగా. వచ్చి మా యింట్లో వుండండి" అన్నాడు రమాకాంత్.

"హాఁ! దైవమా. ఏమిటి నాకీశిక్ష. నన్ను పరీక్షిస్తున్నావా" అని అనుకొన్నాను.

"మంజూ. రెండుకప్పుల కాఫీ పట్రా" అంటూ రమాకాంత్ కాఫీకై ఆర్డరిచ్చాడు.

మంజులత ఇదివరకే కాఫీ ప్రయత్నంలో ఉంది గాబోలు. వెంటనే కాఫీతీసుకుని బెరుకు బెరుగ్గానే టేబిల్‌పై పెట్టి వెళ్ళిపోయింది.

"మంజూ, ఎందుకంత తొందర. యిక్కడ పరాయివారెవరు...కాస్త మెల్లగా నేనడువు" అంటూ ఛలోక్తి విసిరాడు రమాకాంత్.

అంతా ఒక్కసారి నవ్వుకొన్నాము.

"మీకు అభ్యంతరము లేకపోతే మీరు మా ఇంట్లో ఉండొచ్చు" ఇంకోసారి హెచ్చరించాడు రమాకాంత్.

నేను ఎటూ సమాధానము చెప్పలేక తటపటాయించుచూ మెదలకుండా ఊరుకొన్నాను.

"మీకంత సందేహం ఏమిటండి. రేపే మా ఇంట్లోకి వచ్చేయండి. పై మేడమీద గది ఖాళీగానే వుంది. మీ బెడ్డింగూ ఆ గదిలో పెట్టుకోవచ్చు."

"రండి. రేపే వచ్చేయండి. అబ్బాయి అంతగా చెబుతున్నప్పుడు మీరు కాదనటము బాగులేదు" అన్నాడు మంజులత తండ్రి.

"సరే! అలాగేలెండి" అన్నాను విధిలేక.

అయినా నా మనసులో పీకుతూనేవుంది "వద్దామా! వద్దా!" అని.

"సరే. మీరు మాట్లాడుతూ వుండండి...నాకొంచెం పనుంది. ఇప్పుడేవస్తా" అంటూ రమాకాంత్ వెళ్ళిపోయాడు.

మంజులత తండ్రిని చూస్తుంటే మంజులత పట్ల ప్రవర్తించింది యితనేనా అనిపించింది. మంజులతే ఒకవేళ కల్పించి రాసిందేమో. ఏమో? నా మనసు మంజులతను శంకించ దలచలేదు.

నేనూ మంజులత తండ్రీ, అవీ యివీ మాట్లాడుకొన్నాము.

"సరే నేను వెళ్ళి వస్తానండి" అంటూ లేచాను.

"రేపు తప్పకుండా వస్తారుగా" మంజులత అంది.

"సరే" నన్నాను.

"నేను మంజులత పిల్లవాడిని ముద్దాడి చేతిలో అయిదు రూపాయల కాగితం ఉంచాను.

"ఇదెందుకండీ" మంజులత నిరాకరించింది.

"కాదనకమ్మా. ప్రేమతో ఇచ్చినవి కాదనకూడదు" అంటూ నన్ను బలపరిచాడు మంజులత తండ్రి.

మంజులత కాదనలేకపోయింది.

"సరే! అమ్మా! నేను అబ్బాయిని పంపించివస్తాను. తలుపేసుకో" అంటూ నా వెంట వచ్చాడు.

"సరే వెళ్ళివస్తానండి" అంటూ నా సైకిలెక్కాను.

"ఓరేయ్ మధూ! ఇంకెక్కడికిరా రావటం. ఒక్కమాట జ్ఞాపకంపెట్టుకో. మళ్ళీ నీవీ వాల్టేర్ అప్‌లాండ్‌లో గాని, మా ఇంటి పరిసర ప్రాంతాల్లోగాని కనపడ్డావా నీవు ప్రాణాలతో తిరిగి వెళ్ళవు. జాగ్రత. వెళ్ళు" అన్నాడు.

"ఆఁ!" అన్నాను నేను ఒక్కసారి నోరు తెరుచుకొని.

నాకేమి సమాధానం చెప్పాలో తోచలేదు.

అప్పటికే ఆయన వెనుతిరిగిపోయాడు.

నేను వ్యధిత హృదయంతో ఇంటిముఖం పెట్టాను.